# రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మన్‌సాన్‌పల్లి గ్రామం నుంచి 100 మంది బీఆర్‌ఎస్‌లో చేరిక



మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

మహేశ్వరం, నవంబర్ 7: రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీల నుంచి దాదాపు 100 మంది.. బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలకు స్థానం లేకుండా పోయిందని ఆమె ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌తోనే సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి గడపకూ అందుతున్నాయని, తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని, మరోసారి ఆశీర్వదిస్తే మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జాన్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, మల్లారెడ్డి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు..**

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిగిరిపురం గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘానికి చెందిన నాయకులు జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ తోనే అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోతు రాజునాయక్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, యూత్ అధ్యక్షుడు శ్రీను, రాములు, కరుణాకర్, నర్సింహ, ఆంజనేయులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మరు

*మాగంటి ప్రచారంలో పాల్గొన్న తలసాని, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి*



బోరబండలో మాగంటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఎర్రగడ్డ, నవంబర్ 7: కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. కాంగ్రెస్ మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ మంగళవారం బోరబండలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. తలసానితో పాటు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుపరిపాలనతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. దొంగ హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మాగంటి గోపీనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని.. జూబ్లీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేసే అవకాశాన్ని ఆయనకు ఇవ్వాలని సూచించారు. ప్రచారంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జి సిరాజ్, ఏడీ మధు, దాసరి కురుమయ్య, దేవమణి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట




మల్కాజిగిరి సర్కిల్‌లో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 7: బీఆర్‌ఎస్ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తున్నదని మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి, మౌలాలి, గౌతంనగర్, అల్వాల్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... కులవృత్తుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీలకు కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసిందన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గెలిచిన తరువాత అమలు చేస్తామన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోని పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని, కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీతరాము యాదవ్, మీనాక్ష పేందర్ రెడ్డి, సబితాకిశోర్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, నాయకులు పరశురాంరెడ్డి, జేపీసీ వెంకన్న, రాముయాదవ్, అమీనుద్దీన్, ఖలీల్, నాగకుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలే..విజయానికి పునాదులు

కాంగ్రెస్, బీజేపీ నుంచి భారీగా చేరికలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ జి.రాజశేఖర్‌ను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబర్ 7 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి పునాదులని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ సౌండ్స్ అండ్ లైటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజశేఖర్‌తో పాటు 50 మంది బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేస్-1 నుంచి 100 మంది యువకులు, సుభాష్‌నగర్ డివిజన్ జనసేన నాయకుడు గణేశ్‌తో పాటు 500 మంది, సాయిబాబాయాదవ్, జీడిమెట్ల డివిజన్‌కు చెందిన 20 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.గులాబీజెండాను ఎగురవేసేందుకు సైనికుల్లా పని చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పద్మశాలి సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గణేశ్, వెంకటేశ్, అప్పారావు, అడ్వకేట్ కమలాకర్, తిరుపతి యాదవ్, చిన్నరాజేశ్, చంటి సందీప్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలు బోగస్..



ఆరో వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత, గజ్జెల నాగేశ్, పాండుయాదవ్

కంటోన్మెంట్, నవంబర్ 7 : కాంగ్రెస్ ఆరు హామీలపై ఆ పార్టీ నాయకులకే నమ్మకం లేదని కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత విమర్శించారు. కర్ణాటకలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకే గతి లేదని... ఇక్కడ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కంటోన్మెంట్ ఆరో వార్డులోని సీతారాంపురం, భావన కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల అదనపు ఇన్‌చార్జి గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌లతో కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ గెలిచిన తరువాత రూ.400 కే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. బోగస్ హామీలిచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలకు సూచించారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నదన్నారు.

# సంక్షేమం, అభివృద్ధికే పట్టం కట్టండి

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



తార్నాకలో జరిగిన ఎన్నికల ప్రచార పాదయాత్రలో పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, నవంబర్7: సికింద్రాబాద్‌లో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. మంగళవారం తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు తెలిపి, సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రచారంలో పద్మారావుగౌడ్ తనయులు కిశోర్ గౌడ్, కిరణ్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి

*ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి*



ఎల్బీనగర్ నియోజకవర్గం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 7 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చింతలకుంట పల్లవి గార్డెన్‌లో ఖైసర్ ఆధ్వర్యంలో ముస్లిం మజీద్ కమిటీల ఇమామ్, మొజాన్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్నది తెలంగాణ ప్రభుత్వమేనని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని మతాలు, కులాలు సంతోషంగా ఉన్నాయన్నారు. మైనార్టీల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులు తాము బీఆర్‌ఎస్ పార్టీ వెంటే ఉంటామని, తమ ఓటు కారు గుర్తుకేనని చెప్పారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.